పీడకలలోనుంచి ఉలిక్కిపడి లేచి కూర్చుంది, జయ. అప్పటికే కొద్ది కొద్దిగా తెల్లవారుతోంది, ఒక్కసారి చుట్టూ కలయజూసింది. తల్లి, తమ్ముళ్ళు మంచి నిద్దల్లో వున్నారు. ఈ పరుపులు, మంచాలు, ఖరీదైన కర్టెన్లు, మంచి ఫర్నీచరు.... ఇవన్నీ నిన్నటి వైభవానికి చిహ్నాలుగా మిగిలి పోయినాయి.... మరొక నెలరోజుల్లో మెయిన్టనెన్స్ లేక మాసిపోతాయి. చాప మీద పనిపిల్ల .... నెలకు 50 రూపాయిల జీతం, రెండుపూట్ల భోజనం.

కనీసం దానికున్న సెక్యూరిటీ కూడా తన జీవితానికి లేదు. ఎక్కడ వచ్చింది తేడా?!.... వున్నట్లుండి తన బ్రతుకు ఇంత అస్తవ్యస్తానికి గురికావడానికి కారణం ఏమిటి? తనకు జీవితం గురించి ప్లాను లేకనా! ఆలోచిస్తోంది జయ. నాలుక పిడచగట్టుకుని పోయింది. ఫ్రిజ్ తీసింది సరిగా కుట్టలేదని వందరూపాయల షర్టు పాలు పోసేదాని కొడుక్కి దానం చేశాడు పోయిన నెల. ఎలా మార్చగలదు తను వీళ్ళను?

ఉద్యోగం పోయిన ఇరవై రోజుల్లో తనలో చాలా మార్పు వచ్చింది. కానీ వాళ్ళలో రాలేదు. రాదు. వాళ్ళకు ఆ అవసరం లేదు.

ఈ సమస్య పరిష్కారం తనే ఆలోచించాలి.

"జయ పిరికిది కాదు. జీవితాన్ని ఎదుర్కొం టుంది. డిగ్రీ పాసై ఆనందంగా, అమాయకంగా జీవితమంతా పూలరథం అనుకున్న జయ కాక పోవచ్చు ఇప్పుడు. కానీ, ఈ జయ చాలా జీవితాన్ని చూసింది. ఎన్నో అనుభవించింది.

ఈ నాడు తనవల్ల ఏమీ కాదు అని వీళ్ళె వరిమీదో ఆధారపడి లొంగిపడుండే పిరికిది కాదు. చూద్దాం? కొత్త ధైర్యం తెచ్చుకుంటూ మర్నాడు తను కలవబోయే సినిమా ప్రొడ్యూసరును తలుచు కుంటూ మరొకసారి నిద్రలోకి ఒరిగిపోయింది జయ బలవంతంగా.

❋

కళ్ళకింద నీడల మీద మేకప్ కోటింగ్. తల మీద అత్యంత భయంకరమైన ఆర్టిఫిషియల్ విగ్.... పెదవులకు ఎర్రటిరంగు — మొదటి రోజున తన మేకప్ చూచుకుని ఉలికిపోయింది జయ. ఎన్నో ఎడ్వర్టైజ్‌మెంటు పిక్చర్స్‌లో యాక్ట్ చేసిన తనకు మేకప్ కొత్తకాదు. యాక్షన్ అంతకన్నా కాదు. కానీ, ఈ మనుష్యులు, ఈ వాతావరణం చాలా కొత్తగా వుంది. ఇక్కడ గాలిలోనే ఏదో కృత్రిమత్వం వుంది. ప్రతి నవ్వుకూ ఒక అర్థముంది. ప్రతి ప్రామిస్‌కు ఒక రేటు వుంది. అడ్వర్టైజ్‌మెంటు

గొలుసుకథ

మూడవ భాగం

# మరో జయ

-జలంధర


మంచినీళ్ళు తాగుదామని. ఆపిల్‌పళ్ళు .... ఒక్కొక్కటి రూపాయిన్నర.

"చూస్తేబావున్నట్లున్నాయని తెచ్చానే జయా" నిన్న రాత్రి తల్లి అన్నమాటలు గుర్తుకు వచ్చాయి.

"అమ్మా! నీ కూతురికి అదివరకులా సంపాదన లేదు. అర్ధరూపాయి తోటకూరతో పప్పు వండడం నేర్చుకో అమ్మా" అని చెబుదామని నోరు తెరవ బోయింది. కానీ ఆవిడ వినిపించుకోదనీ, ఆ స్థితి దాటిపోయిందనీ ఎప్పుడో అర్థమైంది జయకు. అసలు తనకు డబ్బు విపరీతంగా వస్తున్నప్పుడు తల్లి జాగ్రత్త పడి వుండకూడదూ? తనకు బుద్ధి చెప్పి వుండకూడదూ? ఆవిడ ఏనాడూ కలలో కూడా చూడని సుఖాలను అలవాటుగా తరవాత అవసరాలుగా మార్చుకుంది. దానికి పరోక్షంగా తనేకారణం. ఎంత నిశ్చింతగా నిద్రపోతున్నాడు తమ్ముడు? ఎలా తెలుస్తుంది బాధ్యత? హైలరు

సుప్రసిద్ధ రచయిత్రి మాలతీచందూర్
రచనతో దీపావళి విశేష సంచిక
(నవంబర్ '83) తో ప్రారంభమైన ఈ
గొలుసు కథ డిసెంబర్ సంచికలో
మరొక ప్రసిద్ధ రచయిత్రి డి. కామేశ్వరి
రచనతో మరో మలుపు తిరిగి
ఈ సంక్రాంతి విశేష సంచికతో ప్రముఖ
రచయిత్రి జలంధర రచనతో
తుది మెరుగు దిద్దుకున్నది. ముగ్గురు
రచయిత్రుల రచనతో కొనసాగిన
ఈ వినూత్న ప్రయోగంపై
పఠితల అభిప్రాయాలు ఆహ్వానిస్తున్నాము.

ప్రపంచంలో నాలుగు బట్టలు అమ్ముడు పోవడానికో వస్తువులను కొనుగోలు చేయించడానికో, లేక కంపెనీ పేరు ప్రఖ్యాతులు ఇనుమడించ డానికో తను వాడుకో బడ్డది. ఈ సినిమా ఫక్తు వ్యాపారం- కానీ, ప్రపంచంలో అత్యంత అద్భుతమైన హృదయస్పందనతో కూడి కళలను పెట్టుబడిగా పెట్టి జరుగుతున్న విచిత్ర వ్యాపారం ఇది. లక్షల మీద కోట్లమీద జరిగే వ్యాపారంలో వేలను, లక్షలను లెక్క చెయ్యని మనుష్యులు, స్థాయిలేని వ్యక్తుల విషయంలో రూపాయలకు లెక్క కడతారు. పేరు ప్రఖ్యాతులున్న వారికి అందలం మోచేవారు, కాలికింద రాలిపోయే గడ్డిపూల లాంటి మనుష్యుల్ని పట్టించుకోరు. ఇక్కడ క్వాలిఫికేషన్ కన్న అదృష్టం ముఖ్యం — అందుకే సెంటిమెంటుతో కొందరు గొప్పవారై పోతారు. ఏమాత్రం కలవని కళ, వ్యాపారం అనే రెండు



సమానాంతర రేఖల మీదుగా నడిచిపోతున్న ఈ సినిమా ప్రపంచం అనే రైలుబండి కుదుపులకు సంవత్సరమైనా అలవాటు పడలేకపోతోంది జయ.

జయ నాలుగైదు సినిమాల్లో బుక్ అయింది. చాలా బాధల తరవాత....అన్నీ దాదాపు సెకండు హీరోయిన్ ఛాన్సులే. అవి బాగా చేస్తే....ఫ్యూచర్ ఆలోచించుకున్నది. కానీ, అందులో చాలావాటికి చెయ్యడానికి ఏం లేదు. నాలుగు డైలాగులు, ఆర్టిఫిషియల్ డ్యూయెట్ తప్ప. ఒక పాత్రకు ఉన్న రెండు దుఃఖం సీన్లు డైరెక్టర్ విపరీతంగా, చాలా కృత్రిమంగా ఏడిచేట్లు చేయించాడు. రషెస్ చూస్తూంటే తన దుఃఖం తనకే నవ్వు తెప్పించి నట్టైంది. అన్నింటిలోకీ ఆశ్చర్యం, సినిమాలో తను ఇంత 'తమాషా'గా ఉంటానని అనుకోలేదు జయ. ఏ అడ్వర్టైజ్‌మెంటు సినిమాలోనూ ఇంత 'క్రూడ్'గా లేదు తను. కాస్త కళాభిరుచి వగైరా ఉన్న డైరక్టర్స్ ఉేకింగు వేరేమో కానీ, తన వరకు తన డైరెక్టర్స్‌ను చూస్తే వాళ్ళకన్న తనకు చాలా ఎక్కువ తెలుసనిపించేది జయకు.

రేకుల షెడ్డులాంటి స్టూడియో బైట తురాయి చెట్టుకింద కుర్చీలో కూర్చుని టీ తాగుతూ ఆలోచిస్తోంది జయ. మరి కాస్త దూరంలో అల్యూమినియం స్ప్రింగ్ చైర్ మీద హీరోయిన్ తనకు ఇటువైపుగా చెట్టుకింద చెప్టా మీద ఎక్స్ట్రాలు. ఏమిటో తేడా? తనకన్నా కనీసం కొద్ది వేల మీద ఆదాయం వస్తుందన్న ఆశ ఉంది. కానీ, తనకన్న చాలా తక్కువ కారెక్టర్లు వేయడానికి ఎంతో పోటీ ఎదుర్కొనే అమ్మాయిల్ని చూస్తే ఆశ్చర్యంగా ఉంది. అవసరమనుకుని కొందరూ, మరి ఇంకెందుకూ పనికిరామని కొందరూ—అయినా ఇదేం పద్ధతి? అదే ప్రశ్న తనతోటి అమ్మాయిని అడిగింది:

"నీ మొహం! ఈ వేషాలేవో అన్నం బెడతాయని కాదు. సినిమాలో ముఖం కనిపిస్తే, వాళ్ళ మరో వ్యాపారానికి రేటు పెరుగుతుంది—" అంది ఓరగా అద్దంలోకి చూసుకుంటూ చెవులదగ్గర రింగులు తిప్పుకుంటూ ఆ అమ్మాయి. నెత్తిన దేన్నో పెట్టి ఠపీమని కొట్టినట్టైంది జయకు. ఒకప్పటి తన ఆలోచనలకు జవాబు ఇవాళ దొరికిందనిపించింది. ఆ తరవాత ఇంకా భయంకరమైన భాష, ఊహకందని విశ్లేషణలు విన్నది.

అప్పటిదాకా జయ తనూ తన ఇష్టమొచ్చినట్లు బ్రతికింది. తన రొమాన్సుకు కూడా తన సంపూర్ణ ఇష్టంతోనే లొంగిపోయింది. కానీ, ఈ ప్రపంచంలో ఒక్కసారి కెమెరా ముందు కనబడడానికి కాస్త ముఖ్యమైన వేషం కావాలనుకుంటేనూ ఎంత బాధపడాలో, ఆ తరవాత ఎన్నింటికి తల వంచాలో అర్థమైపోయింది. ఇందులో తన సంతోషము తన ఇష్టము అనే స్టేజీ దాటి, 'అవసరం' 'అంతే'—అనే మాటలకు అలవాటు పడిపోవాల్సి వచ్చింది. ఇక్కడ ఆత్మాభిమానం అసలేమాత్రం చెల్లుబాటు అవని నాణెం. మర్నాడు రాబోయే మహా పతివ్రత వేషం కోసం ఈ రాత్రి జీవితాన్ని అమ్ముకోవలసిన అగత్యం ఇక్కడ చాలా మామూలు.

ఒక రోజు అర్ధరాత్రి రెండు తరవాత, అలిసిపోయి, నలిగిపోయి, తెగిన పూలదండలా వచ్చిన జయను కనీసం పలకరించే దిక్కు కూడా లేదు ఇంట్లో.

"రేపు నీ సినిమా హండ్రెడ్‌డేస్ ఫంక్షన్

కోసం నీకోటి నాకోటి పట్టు చీరలు కొన్నానే అమ్మాయి రెండు వేలయ్యాయి.'' అనే తల్లి.

"కాష్మీర్ ఎక్స్‌కర్షనక్కా — ఐదువందలు కావాలి'' అని అడిగేతమ్ముడు, ఇప్పుడిప్పుడే వాళ్ళ అవసరాలనూ బైట పెడదామని ప్రయత్నించే చిన్నవాళ్ళిద్దరూ. వారెవరూ కొత్తకాదు జయకు. కానీ, అప్పుడప్పుడన్నా అడగాలనిపిస్తుంది. 'మీ జయ ఏమైపోతే మీకివి దొరుకుతున్నాయో తెలుసా? ఒక్కసారి ఆలోచించారా?' అని. కానీ అడగలేదు జయ.

లైట్ వేసుకుని నిద్ర పోదామనుకుంటూండగా. తన పక్కమీద పడుకున్న పెద్ద చెల్లెలు కనబడింది.

'ఓ....మళ్ళీ కడుపుతో ఉంది కాబోలు చలిమిడి కొత్తచీర' ఏడవలేక తనలో తాను నవ్వుకుంటూ నడుం వాల్చింది జయ.

❊

చలిమిడితోనూ, పట్టు చీరతోనూ మాత్రమే చెల్లెలి సమస్య ఆగిపోదని తెలిసిపోయింది మర్నాడు పొద్దున జయకు.

"ఆయనతో నాకు కుదరదక్కా ఆ కోరికలు, అడుగులకు మడుగులొత్తడాలు. నా వల్ల కాదు–నాకు ఒళ్ళుమండి వచ్చేశాను. ఎప్పుడూ నాలో వంకలు వెతకడమే—'' అని తేల్చి చెప్పేసింది పెద్ద చెల్లెలు.

"అయినా అతనికి అదేం బుద్ధే? పెళ్ళాం అంటే గొడ్డు అనుకున్నాడా? రానీ నాలుగు అడుగుతాను'' తల్లి సపోర్టు. ఏమనుకుంటోంది ఈవిడ? రయ్యిన లేచింది జయ.

"ఏమిటమ్మా అడిగేది? ఏం చేద్దామనుకుంటున్నావు దాన్ని? నాలుగు మంచి మాటలు చెప్పి పంపించక పైగా సపోర్ట్ చేస్తావేమిటి?'' అన్నది.

"ఏమిటే! పదిహేను వేలు కట్నమిచ్చి, బోలెడంత సారె పెట్టి పంపాను. నా బిడ్డకేం తక్కువైందని? కూడులేక పంపామా? దాని అభిమానం దెబ్బతిన్నది–వచ్చేసింది.''

"అభిమానం''–తల్లి వంక సూటిగా చూసింది జయ. అలాంటప్పుడు అసలు జయ వంకే చూడదావిడ– ఆ 'పదానికి అర్థమేమిటమ్మా?' అని అడగాలనిపించింది.

ఏది ఏమైనా ఈ కాపురం సరిదిద్దక తప్పదు.... లేకపోతే, చెల్లెలు సమస్య అయిపోతుంది.

"అనవసరంగా ఆవేశపడకమ్మా. నేను వెళ్ళి మాట్లాడతాలే'' అన్నది ఉద్రేకం తగ్గించుకుని జయ.

ఆ రోజు వి. జి. పి గార్డెన్స్‌లో అవుట్‌డోర్. పొద్దున్ననగా మేకప్ వేసుకుని ఒక్క టేక్ కూడా రాక విసుగెత్తిపోయింది జయకు. ఇంక లాభం లేదని డైరెక్టర్‌నే అడుగుదామని నాలుగు అడుగులు వేసింది. హీరోయిన్‌తో సీను డిస్కస్ చేస్తున్నట్లున్నారాయన.

"ఏమిటా తొందర? వేషాలిచ్చేదాకా ప్రాణాలు తీయడం. వచ్చిన తరవాత పెద్ద హీరోయిన్స్‌లా పీలై పోవడం .... ఏం ఇప్పుడు? సాయంత్రం ఏమన్నా ఎంగేజ్ మెంట్స్ ఉన్నాయా?'' ఎంత వెటకారంగా అనాలో అంత వెటకారంగానూ అన్నాడు అతను. చుట్టూ ఉన్నవారి వెకిలి నవ్వులు.

చిర్రెత్తిపోయింది జయకు. అతని కోపానికి కారణం కేవలం జయ కొక్కదానికే తెలుసు — నోటికొచ్చిన నాలుగు అడిగేద్దామనుకుంటుండగా సరిగ్గా సమయానికి ఆమె చెయ్యి పట్టుకుని అవతలకు లాక్కొచ్చేశాడు అసిస్టెంట్ డైరక్టర్ రామారావు,

"నా కసలు ఈ వెధవ వేషాలంటే విసుగు పుట్టింది....'' నోటికొచ్చిన మాటల్లా హిస్టీరికల్‌గా మాట్లాడుతూనే వుంది జయ.

అన్నీ మాట్లాడనిచ్చి,

"మంచిదీ! మానేయండీ'' చల్లటినీళ్ళు ఇస్తూ అన్నాడు అతను.

"అసలేమనుకుంటున్నారు వీళ్లంతా? వేషాలివ్వడానికి ఎంత బాధో, ఆ తరవాత డబ్బులు ఇవ్వడానికి అంత బాధ...నా బతుక్కి నాకు పోయిన సంవత్సరం రాని డబ్బెంతో తెలుసా. పదివేలు— ఏమిటండీ ఇది? నాకేమాత్రం ఇష్టంలేదు. ఇంతకన్న....'' నోటికొచ్చినదంతా మాట్లాడుతోంది జయ. బియే పాసైన జయ, గొప్ప ఫర్మ్స్‌లో మోడల్‌గా పనిచేసిన జయ తననుతాను మర్చిపోయి. భయంకరమైన భాష మాట్లాడేసింది—

"మీరు కావాలని ఇందులోకొచ్చేరు...ఇంక కంప్లెయింట్స్ వద్దు....'' కాస్త కరుగ్గానే అన్నాడు రామారావు.

కొంచెం తగ్గింది జయ...

"అందుకని? నా కుటుంబమంతా నా మీద ఆధారపడింది. నాకు సంపాదించక తప్పదు. నా గ్రాడ్యుయేట్ పట్టా నాకు అన్నం పెట్టలేదు. నేను ఏమాత్రం బాధ్యత వహించలేని నా అందం నాకు అన్నం పెడుతోంది....నిజమే కానీ, అభిమానం చంపుకుని ఇలా...'' జయ కళ్ళల్లో నీళ్ళు.... ముందు కన్నీటి బొట్లుగా, తరవాత కుంభవృష్టిగా, ఆఖరికి ఆపుకోలేని దుఃఖంగా....

దోసిట్లో తలకాయ పెట్టుకుని ఏడుస్తున్న ఆమెనే చూస్తున్నాడు రామారావు. ఆ దుఃఖం జయ ఒక్కదానిదే కాదు....దిక్కుతోచక సినిమా పరిశ్రమలో అడుగుపెట్టి ఆత్మాభిమానం చంపుకోలేని ప్రతి ఆడపిల్ల ఆక్రందనా అది. అర్థం చేసుకునేవారు, పట్టించుకునేవారు ఎవరూ లేరు... కొంటెగా చిలిపిగా చూసే ఆ కళ్ళు, కెమెరాల ముందు ఏ భావం కావాలంటే ఆ భావం వ్యక్తం చెయ్యగల ఆ కళ్ల కన్నీళ్ళు వర్షించగలవనీ, గుండెల్లో సెగలు దాచుకుని, కళ్ళతో నవ్వగలవనీ చాలామందికి తెలియదు....అసలు ఆలోచించరు.

రామారావు మామూలు అసిస్టెంట్ డైరక్టరు. చాలా ఎక్కువగా సినిమా ఇండస్ట్రీకి ఏమాత్రం అక్కర్లేనంత చదువుకున్నవాడు. కానీ సినిమా ప్రపంచపు రాజకీయాల్లో పైకి రాలేక ఉన్నచోటే ఉన్నాడు. అతనికి చాలా మంచి భార్య ఉంది.... టీచర్ ఉద్యోగం చేస్తూ. భర్త అస్తవ్యస్త సంపాదనతో సంసారం లాక్కు వస్తోందామె. పెద్ద బొట్టుతో, సంస్కారం ఉట్టిపడేట్లుండే ఆవిడ జయకు కూడా బాగా తెలుసు....అందుకే సంసార బాధ ఎక్కువ లేని రామారావు ఈ సినిమా ఇండస్ట్రీని సమీక్షిస్తూ, పారడీలు రాస్తూ, నవ్విస్తూ నవ్వుకుంటూ బ్రతికేస్తుంటాడు.

"ఎందుకని ఇలా వుంది ఇండస్ట్రీ రామారావు గారూ! ఈ పరిస్థితికి విముక్తి లేదా?'' కళ్లు తుడుచుకుని మరొకసారి మేకప్ టచప్ చేసుకుని, పెదవులకు లిప్‌స్టిక్ వేసుకుంటూ అడిగింది జయ.

"అదీ....అలా ఆలోచించండి....ఇవ్వాళ ఈ ఇండస్ట్రీ సంధి యుగంలో ఉందేమో జయా! సంపూర్ణమైన విలువకూ, ఖరీదుకూ తేడా కానీ, అర్థంకానీ తెలియనివారు కొన్ని లక్షల డబ్బుతో, అది యిచ్చిన అధికారంతో ఇందులో ప్రవేశిస్తున్నారు. వారు సాలూరు రాజేశ్వరరావుగారికే సంగీతం నేర్పుదామని ప్రయత్నిస్తారు. వాళ్ళ తప్పుకాదు. 'దేన్నన్నా కొనగలం అన్న భావన వాళ్లల్లో పోయే అవకాశం ప్రస్తుతం లేదు.... ఇప్పుడిప్పుడే ఆలోచిస్తున్నారు కొందరు. బైట

పెట్టలేక అణిగిపోతున్నారు కొందరు...ఏదో ఒక రోజు స్పష్టమైన భావన, ఉదాత్తమైన ఆదర్శం ఈ ఇండస్ట్రీని శాసించగలదో, సత్యజిత్‌రేలు, శ్యాం బెనగళ్ళు, విశ్వనాథ్‌లు, బాపూలు డైరెక్టర్స్‌లో ఎక్కువ అవుతారో, ఆనాడు ఈ పరిస్థితి తప్పక మారుతుంది. మీలో హిడెన్ ఆర్ట్ తప్ప, మీరు అఖ్ఖర్లేని ఫీల్డ్, మీకు భావ స్వతంత్రం శారీరక ఆర్థిక స్వతంత్రం ఇచ్చే ఫీల్డ్ తప్పకుండా వస్తుంది. అందాకా, మీ బోటివారు అన్‌ఫిట్ ఇక్కడ—"మేమేమైపోయినా ఫరవాలేదండీ, ఆర్టిస్ట్ అయితే చాలు" అని రైల్వే ప్లాట్‌ఫాం మీద రోజుకు ఒక యాభైమంది రైలుదిగి, ఈ ఇండస్ట్రీకి బలైపోవడానికి సిద్ధమౌతున్నప్పుడు, ఇక్కడి మనుష్యులు వాళ్ళలో టాలెంటే కాక మరేదో కావాలని కోరుకుంటున్నప్పుడు ఈ పరిస్థితి ఇప్పటికి ఇంతే—మారదు..."

ఆలోచిస్తూ సముద్రం వంక చూస్తూ చెప్తున్నాడతను. విని మననం చేసుకుంటోంది జయ. ఇవన్నీ అందరికీ వచ్చే ఆలోచనలే....కానీ, అతను స్పష్టంగా చెప్పగలుగుతున్నాడు. అంతే. కానీ, తన సమస్య?

"ఇందులో నుంచి మరొకదారి కనబడడం లేదే?" నిస్సహాయంగా అన్నది జయ.

"వెతికితే కనబడకపోదు జయా! నాకు సినిమా మానియా. అందుకే, ఇది వదిలి వెళ్ళలేను. కానీ ఒకసారి బ్రతకలేము అనుకున్న తరవాత దార్లే ఉండవా??"

"ఏమో...."

"సెల్ఫ్ డిప్రెషన్ ఒద్దు. లెక్చర్స్ ఇస్తున్నాననుకోకపోతే|ఒక్కసారి ఆలోచించండి. మీరు ఎకనామిక్స్ గ్యాడ్యుయేట్. జపానుకు ఇండియాకు ఒక్క సంవత్సరం తేడాలో స్వతంత్రం వచ్చింది. ఆదేశానికి మనకు కూడా వ్యవసాయం ప్రాథమిక వృత్తి. మనిషికి సరాసరి 2.5 ఎకరాల స్థాయి కూడా సమానమే, భయంకరమైన ఆటం బాంబు ప్రయోగంలో సర్వనాశనమై బూడిదలోనించి ఈ కొద్ది సంవత్సరాల్లో విపరీతమైన ప్రగతి సాధించింది జపాన్. కారణం ఏమిటంటారు? అక్కడా ఓరియంటాలిటీ, సెంటిమెంట్లు, దేవుళ్ళు అన్నీ మనకులాగే ఉన్నాయి. కానీ మనిషి కర్మ వెనకాల దాక్కొని కర్తవ్యం మర్చిపోడు. అక్కడ ప్రతి స్త్రీ ఉపాధి కోసం పద్దెనిమిది గంటలైనా పని చెయ్యడానికి సిద్ధపడుతుంది అందుకే పర్‌కాపిటా ఇన్కం పెరిగింది. కానీ ఇక్కడ? పసితనం నించీ ఆధారపడడానికే అలవాటు పడింది ఆడది! పెళ్ళి చేసుకుని హాయిగా....అనే ఆలోచనతో ఒకరిమీద ఆధారపడి పోవడానికి మానసికంగా సిద్ధపడిపోతోంది. నేను సొసైటీకి ఏం చేయగలను?! అని ఆలోచించడం నేర్చుకోవాలి. ప్రతి ఒక్కరికీ వైట్ కాలర్ జాబ్స్ రావాలని, అవే మంచివన్నీ ఆలోచన పోవాలి మేడం! ఆలోచించండి. దారి దొరక్కపోదు," ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు రామారావు.

"ఏమిటి గురూ! ఆవిడను కూర్చోబెట్టి సుత్తేస్తున్నావు? అక్కడ డైరెక్టర్‌గారు పిలుస్తుంటే" గారపళ్ళతో, వెకిలి నవ్వుతో వచ్చాడు ప్రొడక్షన్ అసిస్టెంటు ఎవరో. చిర్రెత్తి లేచి, రాబోయే షాట్‌కు సిద్ధపడింది జయ. కానీ ఆలోచిస్తూనే వుంది.

[లోకజ్ఞానం – సమాధానాలు]

1. ఇందిరాగాంధి
2. 101
3. ఏడవ శిఖరాగ్ర సమావేశం
4. రవీష్ మల్‌హోత్ర
5. రెండు. అక్కడ శాశ్వత పరిశోధక కేంద్రాన్ని నెలకొల్పడానికి త్వరలో పంపబడే మూడవ పరిశోధక బృందంలో ఒక వనిత (అదితీ పంత్) కూడా సభ్యురాలు కావడం విశేషం.
6. పాకిస్తాన్. మొదట్లో సభ్య దేశమైనా ఆ తర్వాత రాజకీయ విభేదాల వల్ల పాకిస్తాన్ కామన్‌వెల్త్ నుండి వైదొలగింది.
7. పద్మానది
8. మార్టీనా నవ్రతిలోవా
9. అమృత్‌సర్
10. మూడవది

❋

"కొత్త నడుం సన్నబడి, డైటింగ్ చేస్తే మీ అక్కయ్య కన్న మీరే బావుంటారు. అంటున్నారే నన్ను..."అద్దం ముందు నిలబడి రోజ్ పౌడరు లిప్‌స్టిక్ వేసుకుని పదే పదే చూసుకుని మురుస్తూ అంటోంది చెల్లెలు. ఒక వారం రోజులుగా ఆమెను ఒక కంట గమనిస్తూనే ఉంది జయ. పెళ్ళై జీవితం సెటిల్ అయిన ఈ పిల్ల ఇక్కడుంటే ఏదారి పడుతుందో అర్థమౌతోంది ఆమెకు.

ఆ సాయంత్రం షూటింగ్‌నించి సరాసరి చెల్లెలి ఇంటికి వెళ్ళింది.

చెల్లెలు భర్త మోహన్‌రావు తనకు తెలిసినంతలో మంచివాడే....ఏమో....

"రండి రండి" ఆహ్వానిస్తూ, చాలా మర్యాద చేశాడు అతను.

ఏమని మాట్లాడాలి? అసలు కొన్ని ప్రశ్నలడిగేందుకు, తనకే అర్హత ఉందని ముందు? అయినా తప్పదు. మెల్లిగా మాట కదిలించింది.

"సారీ; వదినగారూ! మీ చెల్లెలికి అసలు సంసారం మీద శ్రద్ధలేదు. ఆవిడకన్న మూడేళ్ళు పెద్దవారు. తప్పుగా అర్థం చేసుకోకండి. ఎంత శ్రద్ధగా శరీరాన్ని కాపాడుకుంటున్నారు; మీ పొజిషన్‌కు అవసరం అవ్వచ్చు, ఆ మనిషి అంతలావై పోయి చేటూ పాటూ లేకుండా తినడం. అడ్డమైన వాటికీ ఖర్చు పెట్టడం అదేమిటంటే, పదిహేను వేలు కట్నం అంటుంది. ఇవ్వాళ నా జీతం నెలకు మూడు వేలు అంటే ఐదు నెలల జీతం ఆవిడ తెచ్చిన కట్నం అన్న మాట, దీనిలోనే జీవితం వెళ్ళిపోతుందాండీ? నేను ఇంటికి రాగానే నాకు కావలసిన చిన్న చిన్న అవసరాలను కూడా చూడదు. పెత్తనాలు, సినిమాలు ఎక్కువై పోయినాయి. అదేమంటే మీ అమ్మగారి సపోర్టు. నేనిలా అంటున్నానని కాదు కానీ, మీరు కొంచెం స్ట్రిక్ట్‌గా వుండకపోతే, వీళ్ళెవరూ దారికి రారు?! మీ ప్రొఫెషన్‌లో మీ బాధలేమిటో మీకున్నాయి, కానీ, ఏ బాధలూ లేక, హాయిగా వుండగల మీ సిస్టర్స్ లాంటి వారు కోరి సమస్యలు సృష్టిస్తారు." తనకు ఏమీ కాని వ్యక్తి, కేవలం తన చెల్లెలి భర్త తెగేసి, తన జీవితం గురించి చెబుతూంటే, తనేం చెయ్యలో చెబుతూంటే అవాక్కై విన్నది జయ. తేరుకుని. "నేను కేకలేస్తాను లెండి, ప్లీజ్ ఈ ఆ మెంటాలిటీతో ఆ అట్మాస్ఫియర్‌లో అక్కడుంటే అస్సలు బాగుపడదు." మెల్లిగా లేస్తూ అన్నది.

ఇంటికి వెళ్ళాలనిపించ లేదు. వెళ్ళి సముద్రపు ఒడ్డున చతికలబడింది. ఆమెలో మోహన్‌రావు చాలా ఆలోచనలు రేపాడు.

ఎందుకని మొగవాడిని ఈ ఇల్లాళ్ళు పోగొట్టుకుంటున్నారో, తనలాంటి ఆడదానికి లేని సెక్యూ

రిటీ, పెళ్ళి పెద్ద పెట్టున ఇస్తోంది వీళ్ళకు. మోహన్‌లాల్ భార్య, తన చెల్లెలు వీళ్ళ లాంటి వాళ్ళు చాలామంది కట్నంతో మనుష్యుల్ని, జీవితాల్ని కొనేశామనుకుని, తమకు సంఘం ఇచ్చిన గౌరవ్రదమైన భార్య స్థానాన్ని కాపాడుకోలేక పోతున్నారెందు కని? పురుషాధిక్య ప్రపంచంలో చెప్పుకింద తేళ్ళలా బ్రతికే ఒక వర్గం ఆ వారు సర్వం చంపుకుని ఊడిగం చేస్తున్నట్లు బ్రతుకుతూంటే, అన్నీ ఉన్న వాళ్ళు ఎందుకని ఇలా? తనలాంటి వారు పరమ పద సోపాన పఠంలో పెద్దపాము మింగితే, చిన్న నిచ్చెన ఎక్కితే .... అన్నట్లు బ్రతికేస్తున్నారు. గ్రాడ్యుయేట్ అయిన తన కన్న ఏమీ చదువుకోని తన చెల్లెలు వివాహ ముద్ర పడి మహా అదృష్ట వంతురాలైంది. సౌందర్య వంతురాలైన జయ కన్న, భర్త అనే చక్రమున్న మోహన్‌లాల్ భార్య మరింత అదృష్టవంతురాలైంది. కానీ వీళ్ళెవరూ తమ అదృష్టాలను నిలబెట్టుకోడానికి ప్రయత్నం చెయ్యరా? తనలాంటి వాళ్ళు ప్రతిక్షణం ఈ అస్థిరత్వంలో నించి బైటపడదామని చూస్తూంటే. ఆలోచిస్తూ నిర్ణయాలకొస్తూ, మార్చుకుంటూ చాలాసేపు కూర్చుంది జయ.

"మీ ఆయనతో మాట్లాడాను." ఇంటికి వెళ్ళగానే చెప్పింది చెల్లెలితో.

"ఏమన్నాడే?" తల్లి గభాల్ని అడిగింది.

"ఏమంటాడు? నీ కూతురికి బుద్ధి చెప్పమన్నాడు. అయినా, అదీ దాని సంసారాన్ని వదులుకుని వస్తే నువ్వు కేకలేయద్దమ్మా?" సాధారణంగా తగువంటే వెరిచే జయ ఆ రోజు కావాలనే, తాడో పేడో తేల్చేయ్యాలనే ప్రారంభించింది.

"ఆహా! ఏమిటిట నాకు చెప్పే బుద్ధి? ఎంతసేపూ పెళ్ళాం లోపాల్ని వెతకడం, పరాయి వాళ్ళకు పట్టం కట్టడం-ఏ ఆడది సహిస్తుందేం?"

ఉక్రోషంగా, మహా వెటకారంగా అన్నది చెల్లెలు.

అదివరకులా అక్కడి నించి వెళ్ళిపోలేదు జయ.

"ఆయన సంగతి నాకు తెలయదు. ఇక్కడ మాత్రం నేను చెప్పేదాన్ని, మీరు వినేవాళ్ళు. నీకు పెళ్ళిచేసి బాధ్యత తీర్చుకున్నాను. పున్నంతలో మంచి సంబంధమే చూచి చేశాను. మళ్ళీ నీ అవక తవక తనాలతో నాకు బరువుగా తయారైతే మోసేందుకు నేను ఏమాత్రం సిద్ధంగా లేను. అర్థమైందా?"

"ఏమిటే? అంతంత మాటలంటున్నావు? ఏం చూసుకుని ఆ మిడిసిపాటు? నువ్వు పెట్టకపోతే అడుక్కు తింటామను కుంటున్నావా?" ఒక్క అరుపు అరిచింది తల్లి

"నాకు తెలియదు అదంతా! అలాంటి రోజు వస్తే అదీ తప్పదేమో....మర్యాదగా దానికి నాలుగు మంచి మాటలు చెప్పి పంపించు. నాకు బహుశ అదివరకులా సంపాదన ఉండకపోవచ్చేమో కూడా. ఇవాళ వస్తాయనుకున్న రెండు సినిమాలు చెయ్యి దాటిపోయినాయి...." ఆమె కంఠలో వణుకు.

"ఎందుకని అలా" తల్లి తత్తరపాటుతో అడిగింది.

"ఎందుకంటే?....వాళ్ళతో నాకు సరిపడలేదు...."

> **బి. డి. ఒ**
>
> "బ్లాక్‌లో టికెట్‌లు తేలేదని ప్యూన్‌ని ఉద్యోగం లోంచి తీసేసారుటరా ఆయన" చెప్పాడు రమాపతి
>
> "ఏం ఉద్యోగం చేస్తున్నాడు ఆయన" అడిగాడు ఉమాపతి
>
> "బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్" చెప్పాడు రమాపతి
>
> **రాయగలరా?**
>
> "మీరు కథలు రాయగలరా?" అడిగింది మాలిని
>
> "అవును. కథలే కాదు నవలలతో సహా ఏదైనా రాయగలను" అంది మోహిని
>
> "మరింతవరకు దేనికీ ఎందుకు పంపలేదు" అడిగింది మాలిని
>
> "నేను రాసేది ఊహించి కాదండి, చూసి రాయగలను" చెప్పింది మోహిని
>
> —జీ. ఎస్. లక్ష్మి, తుని

"ఎందుకనక్కా! మాకు నీతులు చెపుతావు కానీ అసలు నీకు బాధ్యత ఉందీ? సరిపడలేదేమిటి సరిపెట్టుకోవాలి కానీ...." కచ్చగా అన్నది చెల్లెలు.

"నోర్మూయ్" భద్రకాళిలా లేచింది జయ.

"ఏమిటన్నావు? సరిపెట్టుకోవాలా? నీకేం తెలుసే జీవితం గురించి? మొగుడు సంపాదిస్తూంటే ఖర్చు పెట్టుకుంటూ బ్రతికేసే మీకు రూపాయి వెనకాల ఎంత కష్టముందో ఎలా తెలుస్తుంది? నాకెందుకు వేషాలు పోయాయని కదూ మీరు అడుగుతోంది?! ఇలాంటి విషయాలు మీదాకా రాకూడదని ఇంతకాలం జాగ్రత్తపడ్డాను. కానీ మీకు తెలియచెప్పకపోవడం తప్పని ఇప్పుడర్థమైంది. ఒక ఆంబోతులాంటి మనిషితో తాగి, నన్ను నేను మర్చిపోయి ప్రవర్తించగలిగితే, ఆ రెండు సినిమాలు నావయ్యేవి. కానీ నాకు ఒప్పుకోవాలని లేదు-అందుకే చెపుతున్నాను. మర్యాదగా నీ జీవితం నువ్వు సరిదిద్దుకో—" ఆమె గొంతులో వణుకుంది. గమనించే వాళ్ళకు ప్రతిమాట వెనకాలా ఒక కన్నీటిబొట్టు కనిపిస్తూనే ఉంది.

మాట్లాడలేదు ఎవ్వరూ — తెలసీ తెలియని నిజాల మధ్య తమనుతాము ఏమార్చుకుని ఎంత కాలమైన బ్రతకచ్చు. కానీ, సత్యం నగ్నంగా ఎదురైతే భరించడం ఎంత కష్టం?

"అందుకే చిలక్కి చెప్పినట్లు చెప్పాను అప్పుడే పెళ్ళి చేసుకోవే అని—మొగరాయిడీలా ఎగబడింది ఉద్యోగం అంటూ..." తల్లి గొంతులో సణుగుడు. కిందపడ్డా తమదే పైచెయ్యి అనుకునే మనుష్యులు.

మెల్లిగా వెనక్కు తిరిగి గదిలో తలుపు వేసుకుని పడుకుంది జయ.

"ఏమిటి చిన్నక్క ఏడుస్తోంది? నువ్వేదో అన్నావట?" స్టైలిష్‌గా జుట్టు పక్కకు తోసుకుంటూ వచ్చి అడిగాడు తమ్ముడు.

"అవును-అన్నాను...."

"అది వెళ్ళనంటే ఇక్కడే ఉండమనచ్చుగా."

మండిపోయింది జయకు.

"నీ ఐదవ ప్రయత్నంలో పాసవబోయే బి. యే డిగ్రీతో నువ్వు పోషిస్తానంటే నాకేం అభ్యంతరం లేదు. నేను మాత్రం ఒప్పుకోను —"

అటు తిరిగి దుప్పటి ముసుగు పెట్టుకుని పడుకుంది జయ.

కాసేపు చూసి వెళ్ళిపోయాడు తమ్ముడు.

*

చేతిలో ఉన్న ఫినిషింగ్ పిక్చర్స్ పూర్తి చేస్తోంది జయ. కొత్తవి ఒప్పుకోవడం లేదు. ఎలా తన జీవితాన్ని మలుపు తిప్పుకోవాలి? ఏమిటి పద్ధతి? ఈసారి చేతినిండా డబ్బు దాచుకుంది తెలివిగా. అందుకని ఆర్థిక బాధలేదు.

ఏ వృత్తైనా కానీ సంఘానికి ఎంతో కొంత ఉపయోగించాలి. అప్పుడే దానికి తగిన పారితోషికముంటుంది. తనలో ఉన్నదేమిటి? అందం, కొంత సౌకుమార్యం, డ్రస్ సెన్స్ — దీన్ని అమ్ముకుని బ్రతికిన జీవితంలో ఆనందం కనిపించలేదు ఆత్మ

వంచన తప్ప. కానీ దీన్ని ఉపయోగించి బ్రతక వచ్చా? ఎలా?! సొసైటీని గమనిస్తూ, నిర్ణయాల కొస్తూ, అర్నెల్లలో తన జీవితానికి స్థిరత్వాన్నిచ్చే పనిచేసింది జయ.

❋

కొన్ని ఏళ్ళ తరవాత—

"బ్యూటీపార్లర్ అనడం కన్న, బ్యూటీ క్లినిక్ అనండి. గౌరవనీయంగా ఉంటుంది. నా స్టూడెంట్స్‌కందరికీ అదే చెప్తున్నాను"—తన కింద తయారైన ఇరవయ్యవ సెట్ స్టూడెంట్స్‌కు సర్టిఫికెట్స్ ఇస్తూ సలహాలిస్తోంది జయ.

ఆమె రాజ్ఞిలా ఉన్నది. లావణ్యంతో, సౌందర్యంతో ఆత్మవిశ్వాసంతో మెరిసిపోతోంది.

ఆరేడు అనుబంధ సంస్థలున్న జయా గ్రూప్ ఆఫ్ బ్యూటీ క్లినిక్స్‌కు ఆమె అధినేత. దానికి అనుబంధ సంస్థలుగా హెర్బల్ క్లినిక్స్, హెల్త్ క్లబ్బులు స్థాపించింది.

"ఈ డిగ్రీలు మనకు అన్నం పెట్టవు." అని కాస్మటాలజీలో డిప్లమా చదివించింది చిన్న చెల్లెల్ని; ఆమెను సర్వ స్వతంత్రురాల్ని చేసింది.

ఫారిన్ వెళ్ళింది. రెండు మూడు డిప్లొమాలు తెచ్చుకున్నది. డాల్‌మేకింగ్ దగ్గరనుంచి, ప్రతి దాన్ని కళాత్మక వ్యాపారంగా మార్చగలిగింది. గవర్నమెంటు ఇచ్చే సదుపాయాలు, తక్కువ వడ్డీ అప్పులు అన్నింటినీ ఉపయోగించుకుంది. తమ్ముళ్ల చేత హాండీక్రాఫ్ట్స్ ఎగుమతి వ్యాపారం పెట్టించింది. ఒకసారి మోహన్‌లాల్ కనబడ్డాడు-పలకరించాడు. స్త్రీగా ఆమెలో ఒక ఉత్తుంగ తరంగం నిద్ర లేచింది. కానీ, అది కొద్దిక్షణాలే - ఈ ప్రలోభాలకి అర్థం లేదు. అందుకే నవ్వుతూ దూరంగా ఉంచేసింది.

ఈ నాడు ఈ స్థానాన్ని చేరడానికి జయ ఎంతో పోరాడింది. కానీ, ఇందులో కమిట్‌మెంటు లేదు, ఆనందం ఉన్నది. మొగవాడిలా ఆలోచించి, ఆడదాన్లా ప్రవర్తించగలిగినప్పుడే ఈ పురుషాధిక్య ప్రపంచంలో నెగ్గుకు రాగలమని గ్రహించింది.

డబ్బు కట్టగలవారిని ట్రైనింగ్ ఇచ్చి డిప్లొమాలిచ్చే ఆమె, పదిమంది అనాధ పిల్లలను కూడా దరిచేర్చుకుని దారి చూపించింది. వారందరికీ జయా మేడం దేవత.

"మేడం మీకు యాభై ఏళ్ళా? పాతికేళ్ళలా ఉన్నారు?" ఎప్పటికప్పుడు కొత్త స్టూడెంటు, ఆ మాట అంటూనే ఉంటారు.

"నా వృత్తికి ఇది అవసరం కదమ్మా!" తియ్యగా నవ్వుతూ అంటుంది.

ఆమె సౌందర్య రహస్యాలే కాదు. మానర్స్ ఎటికసీ-ఇవన్నీ నేర్పిస్తుంది....సుభ్రత, సైన్సు, వినయము, బాధ్యత తమ వృత్తికి ముఖ్యావసరాలు అని చెప్తుంది:

"జ్ఞాపకం పెట్టుకోండి....మన వృత్తికి మూలధనం స్త్రీలో సౌందర్యకాంక్ష; మనం సామాన్య స్త్రీలో ఆ సౌందర్యకాంక్ష, ఆత్మవిశ్వాసం నిద్ర లేపాలి. ఎంత చదువుకున్న భార్య అయినా, ఐశ్వర్యవంతురాలైన భార్య అయినా, ఆమెలో సౌందర్యం సౌకుమార్యం ఉండాలని కోరుకుంటాడు మొగవాడు. అవి నిర్లక్ష్యం చేసే స్త్రీలు, అతి త్వరలో అతణ్ణి చెయిజారవిడుచుకోవల్సి రావచ్చు. ఈ విషయం ఆడవాళ్ళకు చెప్పడం మన బాధ్యత. కొద్ది శ్రమతో ఎంత ప్రత్యేకతతో బ్రతకచ్చో మనం తెలియచెప్పగలగాలి—" బ్యూటీ కోర్సులో డిప్లొమా పొంది ఆమె దగ్గర నుంచి వెళ్ళే ప్రతి డిగ్రీ హోల్డర్ దగ్గరా ఆమె ఈ మాటల్ని వాగ్దానాలుగా తీసుకుంటుంది.

"వీలైనంత వరకూ అందర్నీ నవ్వు ముఖంతో పలకరించండి. చేసే సేవ పద్ధతిగా చెయ్యండి. ఎదుటి వారిగురించి ఎప్పుడూ పాజిటివ్‌గా ఆలోచించండి. వారిలో లోపాలు మన కళ్ళ బడినా, వాళ్ళలోని అందాన్ని, ప్రత్యేకతను గుర్తించి పొగడండి. ఆ చెప్పడంలో కృత్రిమత్వం ఏమాత్రం ఒద్దు. మనస్ఫూర్తిగా చెప్పండి. వారిలో లోపాల్ని సానుభూతితో అర్థం చేసుకుని సరిదిద్ద ప్రయత్నించండి. జ్ఞాపకం పెట్టుకోండి. మనం చేస్తున్న పనేమిటో తెలుసా? సృష్టిలో వుండే లోపాల్నే సరిదిద్ది సౌందర్యవంతం చేస్తున్నామన్నమాట.-ఈ సూత్రాలన్నీ మన వృత్తికే కాదు. ప్రవృత్తికీ, జీవన విధానానికీ కూడా ఉపయోగిస్తాయి-"

లెక్చర్ క్లాస్ కండక్ట్ చేస్తున్న జయా మేడంను అడ్మిరేషన్‌తో చూస్తున్నారు ఆమె స్టూడెంట్స్.

ఎవరో వచ్చారని విజిటర్స్ రూంలోకి వెళ్ళింది ఆమె. పదహారేళ్ళ మొగ్గలాంటి అమ్మాయి. ఒక కాగితం అందించింది.

"జయా! ఈ పిల్ల అనాధ. మీరు దారి చూపగలరన్న ధైర్యంతో పంపుతున్నాను"—రామారావు.

ఒకప్పటి తన స్నేహితుడు, హితైషి.

"నీ పేరేమిటమ్మా" ఆప్యాయంగా అడిగింది

"జయ... జయలక్ష్మి...." ఉలిక్కిపడింది.

మరొక జయ ?!

కాదు. కాకూడదు. తన బాధలు, అనుభవాల గాయాలు ఈ పసి పిల్లలకు సంక్రమించ కూడదు. తన కంఠంలో ప్రాణం వుండగా, తన దగ్గరకు వచ్చిన వారిని దారి తప్పనీయదు.

మెల్లిగా ఆ పిల్ల దగ్గరకు వెళ్ళి పొదివి పట్టుకుని దగ్గరకు తీసుకున్నది జయ.

ఆమె గుండెల మీదుగా తలెత్తి ఆమె వంక చూసే ఆ బేలకళ్ళల్లో ఎన్నో సందేహాలు. ఏవేవో భయాలు.

కానీ, జయ అనుభవాల పేటికలో వాటన్నింటికీ సమాధానాలు వున్నాయి. 'భయం లేదమ్మా. నేను వున్నాను.' అని పొదివి పట్టుకున్న ఆమె చేతులు ఆ పసి మొగ్గకు సందేశాన్నిచ్చాయి. □

### మీ జుట్టు తెల్లబడుతున్నదా?

తల వెంట్రుకలు తెల్లబడుతున్నవారు ఇలా చేసి చూడండి. ఈ కాలంలో బ్యూటీపార్లర్లు వున్నాయి. తెల్ల వెంట్రుకలు నల్లబడడానికి డైలు, అవీ వున్నాయి. కాని కొందరికి డైలు పడకపోవడము, కొందరికి జుట్టు ఎర్రబడటము జరుగుతున్నది. అలాంటి వసరులు లేనివారు, యిలా చేసి చూడండి. కరక్కాయలు 10 బాగున్నవి చూసి, రెండుమూడు సార్లు ఎండలో పెట్టాలి. వీటిని రాత్రి నీళ్ళల్లో నానబెట్టి, కాటుకలాగ రుబ్బి, యినుపబాణలిలో బాగా తట్టి పైన నల్లగుడ్డను చుట్టి, చీకట్లో పెట్టాలి. రెండు రోజులపాటు పెడితే, నీరు అంతా యింకిపోయి, గట్టిగా, పిండి వస్తుంది. దీనిని బాగా చేత్తో నలిపి సన్నని జల్లెడతో జల్లించాలి. ఈ పొడిని రోజూ ఒక చెంచాడు చేతిలో వేసుకొని నూనెలో కలిపి తలకు రాసుకోవాలి. చేతికి రంగు అంటదు. తలకి మాత్రం నలుపు కలిగి వుంటుంది. కొబ్బరి నూనెతో కంటే అముదంతో రాసుకుంటే బాగుంటుంది. ఒక నెల రోజులలో మీకు మార్పు కనిస్తుంది.

—బి. సుజాత, మైసూరు